కథానిక

# హృదయం ఉన్న విశాల

కావలిపురపు సత్యనారాయణరావు

"విశాల వున్నదాండి?" అంటూ ప్రవేశించిన సత్యాన్ని నిలువుగా చూస్తూ-

"ఆఁ వున్నది రండి!" అన్నాడు డాక్టరు.

ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని జేబు రుమాలుతో మొహం తుడుచుకొంటూండగా డాక్టర్ ఆఫీస్‌బాయ్‌ని పిలిచి,

"విశాలగార్ని పిలు" అన్నాడు.

కుర్రాడు వెళ్ళిన వైపే చూస్తూ సత్యనారాయణ డాక్టరుతో,

"విశాల ఎలా పనిచేస్తోందండీ!" అన్నాడు.

డాక్టర్ సత్యనారాయణ వొంక తలెత్తి చూసి నవ్వుతూ,

"ఉన్నవాళ్ళలో ఆ అమ్మాయి వొక్కతే చాలా జాగ్రత్తగా తన డ్యూటీ చేసుకొంటున్నది" అని అన్నాడు.

తన 'విశాల'ని గురించిన ఘనతని వినేటప్పటికి సత్యానికి చాలా సంతోషం వేసింది.

ఇంతలోకే ఆఫీస్‌బాయ్ తిరిగొచ్చి,

"ఒక్క అయిదు నిమిషాలాగి వొస్తానన్నారండి!" అన్నాడు.

డాక్టరు సత్యనారాయణవంక ఓసారి చూసి,

"సత్యనారాయణగారు వొచ్చారని చెప్పవోయ్!" అన్నాడు.

సత్యం ఆ మాటలకి సంతోషించాడుగాని మళ్లీ ఏదో ఆలోచించుకొని లేచి,

"పోన్లెండి, ఇంటి దగ్గర కల్సుకొంటాను" అన్నాడు.

లేచి వెళ్ళబోతూ ఆగి మళ్ళీ వెనక్కి తిరిగి డాక్టరుతో,

"పోనీ! నేనే ఆమెని ఒక్కసారి చూసి పోవచ్చాండి?" అనుమానంగా అడిగాడు సత్యం.

"ఓ, తప్పకుండా" అంటూ డాక్టరు ఆఫీసు బాయ్‌తో సత్యాన్ని తీసుకెళ్ళమన్నట్టుగా సంజ్ఞ చేశాడు.

చిరునవ్వు నవ్వుకొంటూ సత్యం ఆఫీసు బాయ్‌ని అనుసరించాడు.

ఓ గదిదగ్గరికి తీసుకెళ్లి అతను "ఈ గదిలోనే వున్నారండి!" అని పక్కకి తప్పుకొన్నాడు.

దగ్గిరేసున్న తలుపుల్ని నెట్టి సత్యం లోపలికి ప్రవేశించాడు.

"ఊఁ ఈ కాసిని తాగండి!" అంటూ విశాల ఒక పేషెంటుని, మంచంమీద కూర్చుని అతని వీపుకి తన బుజాన్ని ఆనించి, ఒక చేత్తో అతని బుజం పట్టుకుని రెండో చేత్తో గ్లాసులోవున్న పాలని అతని నోటికి అందిస్తూవుంది.

సత్యం గదిలోకి ప్రవేశించగానే విశాలని చూసి 'విశాలా' అని పిలుద్దామనుకున్నాడు గాని నోట్లోంచి మాట వూడిపడలేదు.

అతను పాలు తాగగానే విశాల అతన్ని జాగ్రత్తగా పడుకోబెట్టి తలెత్తి చూసేసరికి గుమ్మం దగ్గిర సత్యం వుండటం చూసి ఆశ్చర్యపోయింది.

సత్యం విశాల పడుకోబెట్టిన వ్యక్తి వొంక ఆశ్చర్యంగా చూస్తూ అనుమానంగా విశాల వంక చూడడం చూసి విశాల—

"రాజారావు — పాపం ఈ మధ్యనే కారుకింద పడ్డాడు..." విశాల మాట్లాడుతుందనే సంగతి కూడా సత్యం గ్రహించలేదు.

అతని కళ్లు గతాన్ని దేన్నో చూస్తున్నట్టుగా నిశ్చలంగా వున్నయ్. అతని మనోవీథిలో ఒకప్పుడు రాజారావు విశాల చేత్తో తిన్న చెంపదెబ్బ దృశ్యం కనిపిస్తోంది. ఆ రాజారావేనా ఈ రాజారావు? ఆ విశాలేనా ఈ విశాల?

రాజారావు తృప్తిగా కళ్లు మూసుకొని పడుకొన్నాడు. విశాల అతనివంక జాలిగా చూసి సత్యంతో ఏదో మాట్లాడబోతూండగా సత్యం

"వెళ్ళొస్తాను విశాలా!" అంటూ బయటికి నడిచాడు.

సమాధానం చెప్పలేక, తను చెప్పదలచుకొన్నదేదో మరిచిపోయి, వెళ్ళిపోతున్న సత్యాన్ని ఆపటానికి ప్రయత్నించాలనే సంగతి కూడా సత్యం వెళ్ళిపోయిన కొన్ని క్షణాల తర్వాతగాని తెలియలేదు విశాలకి.

ఇంటికిపోయి సత్యం తల పట్టుకు కూర్చొని ఆలోచించటం మొదలెట్టాడు. తనని చిన్నప్పట్నుంచీ ప్రేమించి తనని పెళ్ళికూడా చేసుకోమని అడిగిన విశాల ఇంత నీచంగా ప్రవర్తించటం సత్యం సహించలేకపోయాడు. ఆమెకి అతను చేసిన ఎన్నో వాగ్దానాలు అతని కళ్ళ ముందు ఎగతాళి చేస్తున్నట్లుగా నిలుచున్నయ్. తను చనువుకొంటున్న కిందటి రెండేళ్ళలోనూ విశాల రాసిన ఉత్తరాలు ఒక్కొక్కటి చదివి వాటికి వికృతార్థాలు కల్పించుకొన్నాడు సత్యం.

అసలు నర్సుగా చేరానని రాయగానే అనుమానపడ్డాడు అతను. నర్సులమీద వుండే దురభిప్రాయాన్ని సత్యం మనసులో విశాల మరింత గట్టి చేసింది.

రాజారావుని గురించి ఆమె ఎన్ని చెప్పింది? అతనికి చెంపదెబ్బని యెంత గట్టిగా రుచి చూపించింది! ఇవన్నీ తనకి మరిచిపోదామన్నా మరపురావు. కాని ఇవన్నీ విశాల ఎలా మరిచిపోయింది. చెంపదెబ్బ తిన్నా, అంతిమ విజయం సాధించిన రాజారావు పట్టుదల సత్యం మనసులో గొప్ప స్థానాన్నే పొందేదేగాని రాజారావు శ్రమపడకుండానే విశాల తన విశాలహృదయాన్ని అతనిముందు పరిచి వుంటుందని సత్యం నమ్మాడు. విశాల రాజారావుతో కాకుండా ఇంకా ఎవరితోనన్నా వున్నప్పుడు సత్యం చూస్తే అంత బాధపడేవాడు కాదు. రాజారావు మొహం అతని ముందు గర్వంగా, విజయవంతంగా వికటాట్టహాసం చేస్తున్నట్టనిపించింది. సత్యం మనసులో ఏదో మెరుపు మెరిసినట్టు మెరిసింది. దానితో అతని కోపం కొంతవరకు చల్లారింది—అది—తనని నిలకడగా ప్రేమించలేని విశాల రాజారావుని మాత్రం ప్రేమిస్తుందనేమిటి? ఈ విషయంలో రాజారావు మోసపోయ్యాడని పూర్తిగా నమ్మి సంతృప్తిపొందాడు సత్యం.

విశాల వొస్తుందని ఏమాత్రం వూహించి వుండనందున సత్యం పరధ్యానంగా పడక్కుర్చీలో కూర్చుని సిగరెట్లు కాల్చుకొంటున్నాడు. ఎదురుగా విశాల వొచ్చి నుంచుంది. సత్యం ఆమెవంక చూశాడు కూడా. పలకరించలేదు.

"నామీద కోపమొచ్చిందికదూ!" అంటూ దగ్గిరికి వొస్తున్న విశాలని చూసి సత్యం ఆమెని గ్రహించి, తత్తరపడి కుర్చీలోంచి లేచి పక్కకెళ్ళాడు.

మెల్లిగా దగ్గిరికొస్తున్న విశాలని చూసి వెగటుగా మొహం పెట్టి, చెప్పుల్తొడుక్కొని బైటికెళ్ళిపోయాడు సత్యం.

మొహం చిన్నబుచ్చుకొని విశాల ఇంటిమొహం పట్టింది.

తర్వాత విశాల సత్యందగ్గిరికి రెండుమూడు సార్లు వొచ్చింది గాని ఎప్పుడూ సత్యం దొరికేవాడుగాదు.

ఒక్కసారి మాత్రం విశాల ఈ నర్సు ఉద్యోగం చేయటం ఇష్టంలేదన్నట్లుగా చూచాయగా తెలియచేశాడు సత్యం. కాని అది కారణం కాదనుకొంది విశాల. కారణం తను నర్సుగా చేరకపూర్వంఅతనికివుత్తరం రాస్తే సంతోషంతో తిరుగుటపాలో వుత్తరంరాస్తూ, నర్సు వుద్యోగాన్ని "ధర్మం"గా నిర్వహించమనీ—ఇంకా తనకి తెలియనివెన్నో, ఫ్లారెన్సునిగురించీ ఇంకా ఇంకా ఏమిటో, ఎన్నో రాస్తూ—వుద్యోగంతో మంచి పేరుని సంపాదించుకోగలవని ఆశిస్తున్నాను అన్నాడు. మరి—అలాంటి సత్యం ఇటువంటి సూచనలని చేస్తున్నాడంటే ఎవరు మాత్రంఎలానమ్మగలరు?విశాల అసలేనమ్మలేదు.

కాగా తనమీద అంతకోపం రావటానికి గల కారణం ఏమిటో అర్థంకాక బుర్ర బద్దలు కొట్టుకొంది విశాల-హాస్పిటల్లో ఐదు నిముషాలాగి వొస్తాన్నాదనవా?

సత్యం పరీక్ష పాసయాడు. పరీక్షకి చదివినంత హుషారు పరీక్ష ప్యాసవటంలో లేకపోవటంలో సత్యం జీవితమంతా ఒక మెషిన్ మాదిరిగా గడుస్తోంది.

అతనిలో మార్పుని చూడలేక విశాల తల్లడిల్లుతోంది. దీనికంతకీ అసలు కారణం తానో కాదో కూడా ఆమె తేల్చుకోలేక తికమక పడుతుంది.

సత్యం దృష్టిలో తనెందుకు అంత కిందకి లాగబడిందో ఎంతాలోచించినా అర్థం కావటం లేదు ఆమెకు.

చూస్తే సత్యానికి తను దూరంగా వుండటం ఇష్టమేమో అనిపిస్తోంది.

అతనెన్నోసార్లు "వాంటెడ్ కాలమ్స్" చూస్తుంటే అర్థంకాక బాధగా విశాల అతన్లోకి చూసేది. అతను తలొంచుకొనేవాడు.

సత్యానికి ఉద్యోగం దొరికింది. అతనికి ఉద్యోగం దొరికిన సంతోషంకంటే ముందర ఎక్కువగా ఆ స్థలాన్ని వొదిలేయటంలో సంతోషంగా వుంది.

సామానంతా సర్దేశాడు. విశాలకసలు తెలియనే తెలీదు అతనికి వుద్యోగమైనట్టు.

విశాలతో చెప్పకుండానే వెళ్ళిపోదామనుకొన్నాడుగాని—ఎంత దుర్మార్గం చేసినా తనని కొంతకాలంపాటు ప్రేమించినందుకు—ఆమెకిప్పుడు తన ఆఖరు సందేశాన్ని ఇవ్వటం తన కనీసధర్మం అనుకొన్నాడు సత్యం. విశాల ఇంటికి వెళ్ళటానికి మనసొప్పలేదు. కాని బరువుగా అడుగువేసుకొంటూ విశాల ఇల్లు చేరాడు.

విశాల ఏడుస్తుందా? తనమీద ప్రేమ ఆమెలో హరించిపోయినప్పుడు తనకోసం ఆమె ఎందుకేడుస్తుంది? విశాల ఏడవదేమో?—తనంటే—తను వెళ్ళిపోవటమంటే—లెక్క చెయ్యని విశాలదగ్గిరికెందుకెళ్ళాలి తను? వెనక్కి తిరుగుదామనుకొన్నాడు... కాని, ఇంట్లోంచి ఏవో పెద్దగా మాటలు వినిపిస్తున్నయ్. అందులో రాజారావు గొంతుండటం. సత్యాన్ని ఆ మాటలవైపు తిప్పింది.

విశాల గట్టిగా అరుస్తున్నట్టుగా మాట్లాడుతోంది.

"...ఇదివరకు, నా చేతిదెబ్బ రుచి మరిచిపోయినట్టున్నావు. మర్యాదగా బైటికినడు."

"విశాలా! హాస్పిటల్లో నీ చేతుల్లో అంత సుకుమారంగా పెరిగి-ఇప్పుడు నిన్ను వొదిలి వెళ్ళమంటే మాత్రం ఎలా వెళ్ళగలను?... విశాలా?..."

"హాస్పిటల్లో వున్నంతసేపే నేను నర్స్ని. అయినా నువ్వు హాస్పిటల్లోంచి రిలీవ్ అయిన తర్వాత నేను నర్సునే అయినా నీకు సేవ చేయాలని లేదు..."

"విశాలా—" అతను అధికార స్వరంతో అరిచాడు.

"మర్యాదగా బైటికినడు..." దేనికైనా లెక్కచేయనన్నట్టు విశాల అంది.

"నువ్వు కాదన్నా ఇప్పుడు నువ్వు నన్నేం చేయలేవు. విశాలా—హాస్పిటల్లో నువ్వు రోజూ నాకిచ్చే వేడిపాలు బలం ఇంకా చల్లారిపోలేదని గ్రహించు!"

"విశాలా" అంటూ మీదికొస్తున్న రాజారావునుంచి తప్పించుకోటానికి ప్రయత్నించటంలో విశాల గట్టిగా కేకేసింది.

అంతవరకు విశాల ప్రవర్తనని అర్థం చేసుకొన్న సత్యం పశ్చాత్తాపడుతూ నిలబడిపోయాడు.

విశాల కేకతో తేరుకొని, వెంటనే ఒక్క తన్నుతో తలుపుని తెరుచుకొని లోపలికి ప్రవేశించాడు.

సత్యాన్ని చూసి రాజారావు నిశ్చేష్టుడయాడు. విశాల సంతోషంతో ఒక్క పరుగులో సత్యం దగ్గరికొచ్చింది.

సత్యం విశాల మొహంలోని అమాయకత్వాన్ని చూస్తూ బాధగా తన తప్పు తెలుసుకొన్నవాడి మాదిరిగా విశాల మొహంలోకి చూస్తుండగా రాజారావు మెల్లిగా గదిలోంచి జారుకొన్నాడు.

"విశాలా క్షమించు!" అంటూ సత్యం ఆమెని తన కౌగిట్లోకి తీసుకొన్నాడు.

అర్థంకాక విశాల "ఎవరు ఎవర్ని?" అంది.

"నిజంగా నువ్వు "ఫ్లారెన్స్‌వే" అన్నాడు వుత్సాహంగా సత్యం.

సత్యంలో వొచ్చిన మార్పుకి విశాల చాలా సంతోషించింది గాని-ఆమార్పు ఎలావచ్చిందో మళ్ళీ అది ఎలా పోయిందో అర్థం కాలేదు.

విశాల నర్సుగా తన డ్యూటీని విశాల హృదయంతో నిర్వహిస్తూనే వుంది.